సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మహిళా దినోత్సవం
శనివారం । 8 । మార్చి । 2025



జనని.. జగజ్జేత



ఆకాశమే హద్దుగా అవకాశాలను అందిపుచ్చుకుని ఆమె జగజ్జేతగా ఎదుగుతోంది. అమ్మగా, అక్కగా, చెల్లిగా, ఆలిగా కుటుంబ బాధ్యతల్లో మునిగి తేలుతున్న ఆమె ఉద్యోగినిగా, ప్రజాప్రతినిధిగా దక్షత చూపుతోంది. మదుపరులుగా సామాన్య మహిళలు కుటుంబసభ్యుల సహకారం, ప్రోత్సాహంతో చిరు వ్యాపారాల్లో, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక వేత్తలుగా ఆర్థిక సాధికారత వైపు అడుగులు వేస్తున్నారు. అసామాన్య ప్రతిభతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇంటిని చక్కదిద్దిన చేతులతో నవసమాజాన్ని తీర్చిదిద్దుతున్నారు. జగతికి వెలుగులు పంచుతున్న అమృతమూర్తులు జగజ్జేతలు.

నేడు మహిళా దినోత్సవం

లక్ష్యాల వైపు అడుగులు వేసి..

– గంగాభవాని, డ్వామా పీడీ

నెల్లూరు (పొగతోట): మహిళలు స్వయంసమృద్ధి సాధించాలంటే లక్ష్యాల వైపు అడుగులు వేయాల్సి ఉంది. కోనసీమ జిల్లాకు చెందిన గంగాభవానీ విద్యాభ్యాసం స్థాయి నుంచే తన లక్ష్యం వైపు అడుగులు వేశారు. అక్కడే విద్యను పూర్తి చేశారు. 2000 సంవత్సరంలో ఈటీపీఆర్‌డీగా ఉద్యోగంలో చేరిన ఆమె అనంతరం అంచెలంచెలుగా ఎంపీడీఓగా, డీఎల్‌పీఓగా చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా డ్వామా పీడీగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. అన్ని రంగాల్లో ముందుండాలంటే విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం కల్పించాలి. సమాజంలో మహిళను బలపరిస్తే ఆమె కుటుంబాన్ని బలపరుస్తుంది. కుటుంబం బలంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుంది. అప్పుడే సమాజం ఆనందంగా ముందుకు సాగుతుందని ఆమె అంటారు.



కుటుంబ విలువలను కాపాడదాం

– నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ

నెల్లూరు (పొగతోట): నేటి సమాజంలో కుటుంబ విలువలను కోల్పోతున్నాం. కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇచ్చేలా అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలి. డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి నెల్లూరులో ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. వివిధ మండలాల్లో ఎంపీడీఓగా పనిచేశారు. దివ్యాంగుల శాఖ ఏడీగా జిల్లాలో విధులు నిర్వహించారు. అనంతరం పదోన్నతి పొందారు. ప్రస్తుతం డీఆర్‌డీఏ పీడీగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. మహిళలు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తూ ఆరోగ్యం, కుటుంబ విషయాలపై ప్రత్యేక సమయం కేటాయించాలి. ఉద్యోగ, వ్యాపారాల్లో బిజీగా ఉన్నా పిల్లల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలి.



పది పూర్తి కాగానే వివాహం

– జెడ్పీ సీఈఓ విద్యారమ

నెల్లూరు (పొగతోట): విద్యారమ చిత్తూరులో పెరిగారు. పదో తరగతి పూర్తికాగానే వివాహం అయింది. అనంతరం భర్త ప్రోత్సాహంతో ఎస్వీ యూనివర్సిటీలో పీజీ వరకు చదివారు. 2000 సంవత్సరంలో ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓగా చిత్తూరులో దీర్ఘకాలం పని చేశారు. అనంతరం పదోన్నతిపై శ్రీకాళహస్తి డీఎల్‌పీఓగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ సీఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలిగారు.





ట్రాక్టర్ నడుపుతున్న సర్పంచ్ వెంకటసుబ్బమ్మ

ఆమెది బహుముఖ పాత్ర

పొదలకూరు: ఇంటినే కాదు.. ఊరిని పరిశుభ్రంగా ఉంచడంలో ఆమెకు ఆమె సాటి. ఇంట్లో పాడి గేదెల పోషణ, సేద్యం పనుల నుంచి పంచాయతీ పాలన వరకు ఆమె ఒంటి చేత్తో చేస్తోంది. పురుషులతో మహిళలు ఏమాత్రం తీసిపోరని మండలంలోని పులికల్లు సర్పంచ్ గొడ్డేటి వెంకటసుబ్బమ్మ నిరూపిస్తోంది. సర్పంచ్‌కు వ్యవసాయంపై మక్కువ ఎక్కువ. ఆమె స్వయంగా ట్రాక్టర్ నడుపుతోంది. పొలం దుక్కి, దున్నకం పనులు, తన నిమ్మతోటలో చెట్లకు స్ప్రేయర్‌తో పిచికారీ చేయడంతోపాటు అన్ని రకాల వ్యవసాయ పనులను చేయడంతోపాటు, పాడి గేదెల ఆలనా పాలనా చూసుకుంటారు. పొదుపు సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతూ మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారు. పంచాయతీ పాలన విషయానికి వస్తే గ్రీన్ అంబాసిడర్లను నియమించి చెత్త నుంచి సంపద కేంద్రానికి ప్రతినిత్యం ఊర్లో చెత్తను సేకరించి తరలిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

చదువుతోనే మహిళల అభివృద్ధి

– భూమిరెడ్డి పావని, ఆర్డీఓ, ఆత్మకూరు

ఆత్మకూరు: చదువుతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం. గతంలో చదువుకు మహిళలకు ఎన్నో ఆటంకాలు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మహిళలు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలి. అందుకు పూర్తి మద్దతు ఇవ్వాలి. మాది వైఎస్సార్ జిల్లాలోని మైదుకూరు సమీపంలోని పల్లె. తండ్రి గంగయ్య రైతు. తల్లి లక్ష్మీ గృహిణి. చదువులో తనను బాగా ప్రోత్సహించారు. కడపలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో మెరిట్ మార్కులతో ఉత్తీర్ణురాలైనప్పటికీ ఆసక్తి ఉన్న సివిల్స్‌కు సాధన చేసి మూడో సారి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించాను. తిరుపతిలో శిక్షణ అనంతరం తొలిసారి ఆర్డీఓగా ఆత్మకూరులో విధులు నిర్వహిస్తున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం, చదువుపై ఆసక్తే ఈ స్థాయికి తెచ్చింది.



లక్ష్యానికి వివాహం ఆటంకం కాదు

– హిందీ పండిత్ నాగేశ్వరి

నెల్లూరు సిటీ: పెళ్లి తర్వాత జీవితం ఇంతటితో అయిపోయిందని చాలా మంది మహిళలు నిరుత్సాహానికి గురవుతారు. నా జీవిత ప్రయాణం వివాహం తర్వాతనే సార్థకమైంది. నెల్లూరు నగరంలోని మూడో మైలుకు చెందిన నాగేశ్వరికి ఇంటర్ పూర్తి కాగానే 1993లో పెద్దలు వివాహం చేశారు. ఈ క్రమంలో భర్త శ్రీహరిబాబు ప్రోత్సాహంతో వివాహమైన 8 ఏళ్లకు డిగ్రీ పూర్తి చేసింది. హెచ్‌పీటీ, ఎంఏ హిందీ, ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసింది. 2008లో హిందీ పండిట్ గా ఉద్యోగం సాధించింది. మూడేళ్లలోనే ఎస్‌ఏగా పదోన్నతి పొందారు.





లక్ష్యం దిశగా శ్రమించాలి

– పి. సింధుప్రియ, నగర డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్): యువతకు లక్ష్యం ఉండాలి. పట్టుదలతో పాటు సరైన ప్రణాళికతో కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. మా ఊరు తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా వీరారెడ్డిపల్లి. తండ్రి పి.లింగారెడ్డి ఉపాధ్యాయుడు కాగా, తల్లి వనజాక్షి గృహిణి. బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఏడాది పాటు సివిల్ ఇంజినీర్‌గా పనిచేశాను. సివిల్స్, ఏపీపీఎస్సీ పరీక్షలు రాసి ఉన్నత ఉద్యోగం సాధించాలని ఉస్మానియా లో ఎంఏ సోషియాలజీ పూర్తి చేశాను. 2018లో స్త్రీ,శిశు సంక్షేమశాఖలో సీడీపీఓగా సూర్యాపేటలో బాధ్యతలు చేపట్టాను. మహిళా కమిషన్‌లో విధులు నిర్వహిస్తుండగా 2022లో ఏపీపీఎస్సీ రాసి డీఎస్పీగా ఎంపికయ్యాను.

ఆత్మస్థైర్యంతో ముందుకు

– సబ్‌కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ

కందుకూరు: ఎంచుకున్న రంగంలో రాణించేందుకు మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి. ప్రస్తుత సమాజ తీరును బట్టి మహిళలు ఇంటికే పరిమితం కాకూడదు. ఇంట్లో ఉండే మహిళలైనా సరే ఏదో ఒక రంగంలో రాణించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తే విజయం సాధించడం చాలా సులభం. స్వయం ఉపాధిని పొందేందుకు చేతి వృత్తులు వంటివి నేర్చుకుని కుటుంబానికి అండగా నిలబడవచ్చు. మహిళల్లో కూడా తాము సాధించగలం అనే నమ్మకం పెరుగుతుంది. పెళ్లికాగానే అంతా అయిపోయిందనే భావన నుంచి మహిళలు బయటకు వచ్చి స్వతంత్రంగా రాణించేందుకు ప్రయత్నం చేస్తే బాగుంటుంది. ప్రతి తల్లిదండ్రులు కూడా చదువుకునే విషయం దగ్గర నుంచి అన్ని విషయాల్లోనూ ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాల్సిన అవసరం ఉంది.



ఆశయం ఉంటే ఏదైనా సాధ్యమే

– గంగమాల విలాసిని, వింజమూరు బాలికల హైస్కూల్ పీడీ

వింజమూరు(ఉదయగిరి): ఆశయం ఉంటే.. ఏదైనా సాధించడం కష్టం కాదు. చిన్న తనం నుంచి క్రీడలంటే ఎంతో ప్రేమ. ఆ మక్కువే తనను వ్యాయామ ఉపాధ్యాయ వృత్తి వైపు నడిపించింది. 2009లో పీఈటీగా ఉద్యోగం పొంది కాటేపల్లి, వింజమూరు ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ మాస్టర్ అథ్లెటిక్స్ వెటరన్ పోటీల్లో జాతీయ స్థాయిలో ఎన్నో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించాను. 2019లో ఇంటర్ నేషనల్ స్థాయి (సింగపూర్) ఆటలో పాల్గొనే అవకాశం వచ్చినా, ఆర్థిక ఇబ్బందులతో వెళ్లలేకపోయాను. 2019 నుంచి 2024 వరకు వరసగా వెటరన్ (35–40 ఇయర్స్ ఏజ్ గ్రూపు విభాగం)లో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల కాకినాడలో రాష్ట్ర స్థాయిలో పీడీలకు జరిగిన పోటీల్లో లాంగ్‌జంప్, వాకింగ్, 100 మీ. పరుగు పందెంలో గోల్డ్ మెడల్స్ సాధించాను.



కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం అందుకున్న విలాసిని (ఫైల్)

విద్యతోనే సాధికారిత

– ఆయేషాబేగం, ఐఎంఎల్ డిపో మేనేజర్



నెల్లూరు(క్రైమ్): విద్యే మహిళా సాధికారతకు బాటలు వేస్తుంది. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ ఖలీల్‌బాషా, ఖాజాబీ దంపతుల కుమార్తెను. డిగ్రీ వరకు మైదుకూరులో చదువుకుని, తిరుపతిలో ఎంబీఏ పూర్తి చేశాను. నా తల్లిదండ్రుల కుటుంబాల్లో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కష్టపడి చదివాను. 2018లో గ్రూప్–1లో రాణించి ఎక్సైజ్ శాఖలో ఏఈఎస్‌గా బాధ్యతలు చేపట్టాను. ఏలూరులో బాధ్యతలు చేపట్టిన అనంతరం అంచెలంచెలుగా పదోన్నతి పొంది ప్రస్తుతం నెల్లూరు ఐఎంఎల్ డిపోలో విధులు నిర్వహిస్తున్నాను. విద్యతోనే ఉన్నతి లభిస్తుంది. అక్షరాస్యత ఎక్కువగా ఉన్న చోట మహిళలు అన్ని రంగాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

మొక్కుబడిగా పనులు.. రూ.లక్షల్లో నిధుల స్వాహా

- మౌనం పాటిస్తున్న ఉన్నతాధికారులు
- వరికుంటపాడు ఫారెస్టు బీట్‌లో అంతులేని అవినీతి

మొక్కల మాటున మేత

ఉదయగిరి ఫారెస్టు రేంజ్ పరిధిలోని కృష్ణంపల్లి సెక్షన్ వరికుంటపాడు బీట్ పరిధిలో కొత్తపేటలో జరుగుతున్న అటవీ ప్రత్యామ్నాయ వనీకరణ (సీఏ) పథకం పనుల్లో అంతులేని అవినీతి చోటు చేసుకుంటోంది. భూమికి భూమి పరిహారంగా కొనుగోలు చేసిన ప్రక్రియ నుంచి భూమి అభివృద్ధి, మోడు కర్ర తొలగించడం, గుంత తీయడం, మొక్కలు నాటడం, ఎరువులు వేయడం వరకు అడుగడుగునా నిధులను క్షేత్రస్థాయిలో దోచుకున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో నాటిన మొక్కలు కూడా ఎండిపోతున్నాయి.

ఉదయగిరి: అటవీ శాఖ వరికుంటపాడు బీట్ పరిధిలో కొత్తపేటలో క్యాంపా పథకం పేరుతో అటవీశాఖలో దోపిడీ పర్వానికి తెరతీశారు. గతేడాది ఈ ఏరియాలో సుమారు 116 హెక్టార్లలో తెల్లమద్ది, వేప, మర్రి, రాగి, నేరేడు, ఎర్రచందనం మొక్కలు నాటారు. ఇక్కడ నుంచే అవినీతికి శ్రీకారం చుట్టారు. ఈ మొత్తం భూమి కొనుగోలు చేసి అటవీ శాఖకు ఇచ్చారు. అప్పటికే ఈ భూమిలో జామాయిల్ మోడు ఉంది. ఈ ల్యాండ్ అభివృద్ధి పేరుతో అధికారులు సుమారు రూ.20 లక్షలు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మోటు కర్ర మొత్తం రూ.20 లక్షలకు అమ్ముకున్నారు. అంటే అభివృద్ధి పేరుతో నిధులు కాజేయడంతో పాటు ఉన్న మోడు అమ్మకం ద్వారా పెద్ద మొత్తంలో జేబుల్లో వేసుకున్నారు. వరికుంటపాడు, దుత్తలూరు మండలాల సరిహద్దు ప్రాంతం కొత్తపేట ఏరియాలో 116 హెక్టార్ల ప్రభుత్వ భూమిలో ప్రత్యామ్నాయ వనీకరణ పథకానికి సుమారు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉదయగిరి అటవీ అధికారులు ప్రారంభించారు. ఈ పనులు కనియంపాడు వన సంరక్షణ సమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరగాలి. కానీ వారిని డమ్మీ చేసి పనులు మొత్తం ఉదయగిరి ప్రాంతం నుంచి కూలీలను తీసుకొచ్చి పనులు చేయించారు. రికార్డుల్లో మాత్రం కనియంపాడు వీఎస్ఎస్ సభ్యులు పేర్లు నమోదు చేశారు. ఈ వ్యవహారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి స్థానిక నేతలు తీసుకెళ్లారు. దీంతో ఆయన స్థానిక నేతలకు వీఎస్ఎస్ సభ్యులకు, అటవీ అధికారులకు రాజీ కుదిర్చి కొంత మొత్తం పంచుకున్నట్లు సమాచారం.



కొత్తపేట బీట్–2లో తూతూ మంత్రంగా అంతర సేద్యం



ఎండిన మొక్క

పనుల్లో మాయ.. దోపిడీ అధికమాయె

మొక్క నాటే సమయంలో నిబంధనలు పాటించలేదు. ఈ భూమి మొత్తం ఇసుక తెర తేలిక నేల అయినప్పటికీ కొంత మేర గట్టి నేలగా చూపించి అధిక రేట్లతో ఎంబుక్ రికార్డు చేసి నిధులు కాజేశారు. మొక్క నాటేందుకు 30 సెం.మీ. లోతు, వెడల్పుతో గుంతలు తీయాల్సి ఉన్నా.. పైపైనే గుంతలు తీసి నాటారు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉండదు. ఎండ బెట్టకు మొక్క చనిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం చాలా మొక్కలు ఎండిపోయి ఉన్నాయి. మొక్కలు నాటేటప్పుడు రసాయనిక ఎరువులు (డీఏపీ, యూరియా, ఫాస్ఫరస్) గుంతల్లో వేసి మట్టి కప్పివేయాలి. కానీ ఎరువులు వేయ లేదు. అన్నీ వేసినట్లుగా ఎంబుక్‌ల్లో నమోదు చేసుకుని పెద్ద మొత్తంలో నిధులు స్వాహా చేశారు.

అంతర సేద్యంలో అదే తంతు

ఈ ఏడాది మొక్కల్లో అంతర సేద్యం మమ అనిపించారు. అరకొరగా చేసి.. మొత్తం భూమిలో సేద్యం చేసినట్లు నిధులు డ్రా చేశారు. మొక్కలు దగ్గర 30 సెం.మీ. మేర కూలీలతో అంతర కృషి చేయాలి. కానీ అది కూడా తూతూ మంత్రంగా చేసి నిధులు కాజేశారు. ఈ భూమిలో 3 బీట్‌లు ఉండగా ఒక్కొక్క బీట్‌కు ముగ్గురు చొప్పున కాపలాదార్లను పెట్టినట్లు రికార్డు చేసి నెలకు ఒక్కొక్కరి పేరుతో రూ.13 వేలు డ్రా చేస్తున్నారు. కానీ అక్కడ మొత్తం ముగ్గురు మాత్రమే కాపలా ఉన్నారు. వారికి నెలకు రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారు. రెండో ఏడాది మొక్కలకు ఎరువులు కూడా వేయకుండానే వేసినట్లు రికార్డు చేసి నిధులు కాజేశారు. అనేక విధాలుగా పెద్ద మొత్తంలో ప్రజాధనం అటవీ అధికారులు, సిబ్బంది దిగమింగేశారు. దిగువ స్థాయి నుంచి పైస్థాయి వరకు ఎవరి కమీషన్ వారు తీసుకొని గుమ్మనంగా అవినీతిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కమీషన్లతో ముఖం చాటవేత

ఈ అవినీతి మొత్తం బయటకు రావాలంటే విజిలెన్స్, సీఐడీ సమగ్రంగా దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. అందులో జరిగిన అవినీతి బయట పడుతుంది. ఈ అవినీతి వ్యవహారంలో కొంత మంది అధికారులు పాత్ర ఉండడం, పైగా ఈ పనులకు సంబంధించి ఎఫ్‌బీఓ నుంచి జిల్లా స్థాయి అధికారులకు వరకు కమీషన్లు ఇస్తుండడంతో పత్రికల్లో, మీడియాలో కథనాలు వస్తున్నా.. స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బంది పెడితే

క్రిమినల్ కేసులు

- కనీస మద్దతు ధరకు కొనాల్సిందే
- 24 నుంచి 48 గంటల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ
- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్. పక్కన జేసీ కార్తీక్

నెల్లూరు (అర్బన్): ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి కలెక్టర్ ధాన్యం కొనుగోళ్ల విషయంపై మాట్లాడారు. జిల్లాలో అన్ని రకాల ధాన్యాలు కలిపి 11 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా ఉందన్నారు. ఇందులో ప్రధానంగా 5 లక్షల మెట్రిక్ టన్నులు బీపీటీ రకం దిగుబడి వస్తుందని లెక్కలు వేశామన్నారు. కనీసం 50 శాతం ధాన్యాన్ని రానున్న రెండు వారాల్లో కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కన్నా బయట ధర ఉంటే రైతులు అమ్ముకోవచ్చన్నారు. ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరకు మిల్లర్లు కొనుగోలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. తేమ శాతం కొంచెం అటూ, ఇటూ ఉన్నా మిల్లర్లు కొనాల్సిందేనన్నారు. మిల్లర్లతో సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశామన్నారు. రైతులు, వ్యాపారులు నష్టపోకూడదనే ఉద్దేశంతో 105 రైసుమిల్లుల వద్ద ప్రభుత్వ అధికారులను అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటికే మిల్లర్లు రూ.20 కోట్లు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చారని, రాబోయే నాలుగైదు రోజుల్లో మరో రూ.40 కోట్లకు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే లక్ష గన్నీ బ్యాగులు సిద్ధం చేశామన్నారు. మరో 3 రోజుల్లో పూర్తిస్థాయిలో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుతామన్నారు. ఒక వేళ రైతులే గన్నీ బ్యాగులు, హమాలీలు, రవాణా సమకూర్చుకుంటే అందుకు సంబంధించిన నగదును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ధాన్యం సేకరించిన 24 నుంచి 48 గంటల్లోపు నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. నెల్లూరు బీపీటీ ధాన్యానికి మంచి నాణ్యత ఉందన్నారు. అందువల్ల మిల్లర్లు ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సీఎంఆర్ రూపంలో బియ్యంగా సేకరించనున్నామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన పడాల్సిన పని లేదన్నారు. ధాన్యం కొనాలంటే ముందుగా రైతులు వీఏఏను కలిసి తాము ఎప్పుడు వరి కోతలను ప్రారంభిస్తామో షెడ్యూల్ రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఈ ఒక్క పని చేస్తే ఇక అప్పటి నుంచి అధికారులు ధాన్యం సేకరణ నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమయ్యే వరకు పర్యవేక్షణ చేస్తారన్నారు. రైతులు ధాన్యాన్ని అమ్ముకోకుండా నిల్వ ఉంచుకోవాలనుకుంటే ఎంపీఎఫ్‌సీ, ఏపీఎంఎస్ ద్వారా గోడౌన్లను అందుబాటులోకి తెస్తామన్నారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటామని తెలిపారు.

క్లుప్తంగా

'పది' విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

నెల్లూరు సిటీ: ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను చూపించి ప్రయాణం చేయొచ్చని స్థానిక అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 511 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 511 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 23,575 మందికి గానూ 23,106 మంది ఎగ్జామ్స్ రాశారు. 469 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 994 మందికి గానూ 952 మంది హాజరయ్యారు. 42 మంది గైర్హాజరయ్యారు.

సంస్కృత జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం

నెల్లూరు(టౌన్): నెల్లూరులోని కేఏసీ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆర్ఐఓ శ్రీనివాసులు చీఫ్, అసిస్టెంట్ ఎగ్జామినర్లతో సమావేశం నిర్వహించి పొరబాట్లకు తావు లేకుండా మూల్యాంకనం చేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో కేఏసీ ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

13న వాహనాల వేలం

నెల్లూరు(టౌన్): జిల్లా రవాణా శాఖ అధికారుల తనిఖీల్లో పట్టుబడి ఎలాంటి పత్రాల్లేకుండా సీజ్ చేసిన 17 వాహనాలను ఈనెల 13వ తేదీన వేలం వేయనున్నట్లు డీటీసీ చందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.5 వేలు డిపాజిట్‌ను చెల్లించాలన్నారు. వాహనాన్ని పాడుకున్న వారు వేలంలో దక్కించుకున్న మొత్తానికి 18 శాతం జీఎస్టీ, నిర్దేశిత పార్కింగ్ ఫీజు చెల్లించాలన్నారు. వేలం రోజే బిడ్ రూపంలో సగం మొత్తాన్ని కార్యాలయంలో కట్టాలన్నారు. మిగిలిన మొత్తాన్ని ఈనెల 24వ తేదీలోపు చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనే సభ్యులు జీఎస్టీ నంబర్‌ను కలిగి ఉండాలన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 2,945 మంది హాజరు

నెల్లూరు(టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 318 మంది అభ్యాసకులు గైర్హాజరయ్యారు. 3,263 మందికి గానూ 2,945 మంది హాజరయ్యారు. కెమిస్ట్రీ, ఎకనామిక్స్ సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి.

రైలు ఢీకొని యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై శుక్రవారం జరిగింది. మృతుడి వయసు సుమారు 25 నుంచి 30 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. పసుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడిచేతిపై అమ్మ.. సంజీవమ్మా అనే పచ్చబొట్టు ఉంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుదేశం నాయకుల దౌర్జన్యం

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడి సొంత స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



శీనయ్య స్థలంలో వేసిన రోడ్డు

వెంకటాచలం: మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ పరిధిలో జంగాలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన పచ్చికాల శీనయ్య సొంత స్థలంలో టీడీపీ నాయకులు దౌర్జన్యంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శీనయ్యకు చెందిన సర్వే నంబర్ 531 – 2లో 21 అంకణాల స్థలంలోని ప్రహరీని టీడీపీ నాయకులు దౌర్జన్యంగా కూల్చేశారు. దీనిపై బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇటీవల ఆ భూమిలో సీసీ రోడ్డు వేసేందుకు చదును చేయగా శీనయ్య కలెక్టర్, ఎస్పీ, రూరల్ డీఎస్పీకి ఫిర్యాదు చేశాడు. దీంతో ఇటీవల గ్రామానికి పోలీసులు, పంచాయతీ అధికారులు వచ్చి పరిశీలించారు. కానీ గురువారం ఆ స్థలంలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా రోడ్డు వేశారని శీనయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమై ఎంపీడీఓ కల్పనను వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ జరుగుతోందని, రోడ్డు నిర్మాణ విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు.

గట్టెక్కుతామా.. నష్టపోతామా..



మరికొద్దిరోజుల్లో పొగాకు వేలం ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. రెండేళ్లుగా ధరలు ఆశాజనకంగా ఉండి రైతులకు లాభాలొచ్చాయి. ఈ ఏడాది మార్కెట్ ఎలా ఉంటుందోనని ఎదురు చూస్తున్నారు. సాగు ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో వేలంలో దక్కే ధరలపై ఆశలు పెట్టుకున్నారు. గతేడాది కంటే ధరలు పెంచితేనే లాభాలు వస్తాయని లేకుంటే నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అటు బోర్డు అధికారులతోపాటు, ఇటు రైతులు అభిప్రాయపడుతున్నారు.

- ఈనెల 10వ తేదీ నుంచి పొగాకు వేలం ప్రారంభం
- ధరలపై ఆశలు పెట్టుకున్న రైతులు
- గతేడాదితో పోల్చుకుంటే భారీగా పెరిగిన సాగు ఖర్చులు
- సరాసరిన కిలోకు రూ.300 ఇవ్వాలని రైతుల డిమాండ్
- 162 మిలియన్ కేజీల వరకు ఉత్పత్తులు రావొచ్చని అంచనా

కందుకూరు: పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 11 వేలం కేంద్రాలున్నాయి. ఈనెల 10వ తేదీ నుంచి కందుకూరు – 1వ కేంద్రంతోపాటు ఒంగోలు –1, కొండపి, పొదిలి కేంద్రాల్లో వేలం ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. మిగిలిన కందుకూరు – 2, కలిగిరి, డీసీపల్లితోపాటు ఒంగోలు – 2, టంగుటూరు, వెల్లంపల్లి, కనిగిరి వేలం కేంద్రాల్లో 19వ తేదీ నుంచి మొదలవుతుంది. 2025 – 26 సీజన్‌కు సంబంధించి 11 కేంద్రాల పరిధిలో 105.27 మిలియన్ కేజీల పొగాకును అధికారికంగా అమ్ముకునేందుకు బోర్డు అనుమతి ఉంది. అయితే ప్రస్తుతం సాగు విస్తీర్ణం, వస్తున్న ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని 162 మిలియన్ కేజీల వరకు ఈ సీజన్‌లో అమ్మకాలు ఉండొచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

ధరలు పెంచాలంటూ..

రెండు సంవత్సరాలుగా పొగాకు మార్కెట్ రైతులకు లాభాల పంట పండించింది. దీంతో ఈ ఏడాది అనేకమంది సాగుపై అధికంగా మొగ్గు చూపారు. బోర్డు పరిమితికి మించి భారీగా పంట వేశారు. రైతులు సాగులో పోటీ పడటంతో పొలాలు, బ్యారెన్ల కౌలు ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతేడాది రూ.లక్ష ఉన్న బ్యారెన్ కౌలు ఈసారి రూ.2.50 లక్షల వరకు పెరిగింది. పొలం కౌలు, కూలీల రేట్లన్నీ రెట్టింపయ్యాయి. ఈ పరిస్థితుల్లో గతేడాది కంటే బ్యారెన్‌కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అదనంగా ఖర్చయ్యిందని స్వయంగా బోర్డు అధికారులే లెక్కలు వేస్తున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా వేలంలో ధరలు కూడా పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేజీ పొగాకుకు సరాసరి ధరను రూ.300కు తగ్గకుండా ఇవ్వాలని కోరుతున్నారు. అయితే గతేడాది వేలం ముగిసే సమయానికి కేజీ సరాసరి ధర రూ.254 మాత్రమే ఉంది. కానీ రైతులు ఆశించిన స్థాయిలో ఈ సంవత్సరం మార్కెట్ ఉంటుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కర్ణాటక మార్కెట్‌లో ఇలా..

ప్రస్తుతం కర్ణాటకలో జరుగుతున్న పొగాకు వేలం అక్కడి రైతులకు కొంత ఆశాజనకంగానే ఉందని అధికారులు చెబుతున్నారు. బ్రైట్ గ్రేడ్ కేజీ పొగాకు ధర రూ.337 వరకు పలుకుతోంది. మొత్తంగా కేజీ సరాసరి ధర చూస్తే రూ.268.25 వరకు ఉంది. అయితే ఆంధ్రాలో పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ధరలు పెంచాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

50 శాతం పైనే..

ఈ ఏడాది పొగాకు నాణ్యత ఆశాజనకంగా ఉండటం రైతులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. మొత్తం ఉత్పత్తుల్లో 50 శాతానికి పైగా మొదటి రకం అంటే బ్రైట్ గ్రేడ్ వచ్చాయని బోర్డు అధికారులు చెబుతున్నారు. మిగిలిన గ్రేడ్‌లు కూడా ఆశించిన స్థాయిలో నాణ్యతగా ఉన్నాయంటున్నారు. ఇది వేలంలో రైతులకు సానుకూలాంశంగా మారనుంది. అయితే గ్రేడింగ్ విధానంలో వారు సరైన జాగ్రత్తలు పాటించి బేళ్లు కట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉత్పత్తి బాగా పెరిగింది

ఈనెల 10వ తేదీ నుంచి ఈ సీజన్‌కు సంబంధించి అధికారికంగా పొగాకు వేలం ప్రక్రియను ప్రారంభించనున్నాం. మొదటి దశలో నాలుగుచోట్ల, 19వ తేదీన మిగిలిన కేంద్రాల్లో మొదలుపెడతాం. ఈ ఏడాది ఉత్పత్తి బాగా పెరిగింది. రైతులు ఖర్చులకు అనుగుణంగా ధరలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వేలం ప్రారంభమైన తర్వాత ధరలపై ఒక అంచనాకు రాగలం.

– లక్ష్మణరావు, ఆర్ఎం



కందుకూరు ప్రాంతంలో సాగులో ఉన్న పొగాకు పంట

రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ధాన్యం తాలూకా నగదు ఇవ్వకుండా రైతును మోసగించిన రైస్‌మిల్లు యజమానిపై నెల్లూరు నవాబుపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఆత్మకూరు పట్టణం పంటవీధికి చెందిన పి.పవన్‌కుమార్‌రెడ్డి నెల్లూరు నగరంలోని యనమలపాళెంలో ఉన్న శ్రీసాయిబాబా రా అండ్ బాయిల్డ్ రైస్‌మిల్లు యజమాని శేఖర్‌బాబుకు రూ.8.31 లక్షల విలువైన ధాన్యం తోలాడు. శేఖర్‌బాబు దీనికి సంబంధించిన నగదు ఇవ్వకుండా మోసం చేసి పరారయ్యాడు. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తెలిపారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శనివారం నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. దీనికి రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి.నారాయణ, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. గ్రామీణ నీటి సరఫరా, అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించనున్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సీఈఓ విద్యారమ శుక్రవారం కోరారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.70
సన్నవి :	రూ.50
పండ్లు :	రూ.35



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	92
లేయర్ (లైవ్) :	90
బ్రాయిలర్ చికెన్ :	170
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	190
లేయర్ చికెన్ :	153



ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- 9 నుంచి 15వ తేదీ వరకు..

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ఆదివారం నుంచి 15వ తేదీ వరకూ ప్రసన్నుని వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. భక్తుల పాలిట ప్రసన్నుడిగా, ఆపద మొక్కులవాడిగా పేరొందిన స్వామిని దర్శించి, తరించేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రధాన ఘట్టాలైన గరుడ సేవ, మొక్కుబడులు, కల్యాణోత్సవం రోజుల్లో బిలకూట క్షేత్రం భక్తజన సంద్రంగా మారుతుంది. బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. భక్తుల కోసం చలువ పందిళ్లు, చలివేంద్రాలు సిద్ధమవుతున్నాయి. స్వామివారి విద్యుత్ కటౌట్లను పెడుతున్నారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు మెరుగుపరిచారు. భక్తుల భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతరాలయంలో ప్రత్యేకంగా ఏసీలు ఏర్పాటు చేస్తున్నారు.



కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రం

ఇలా..

9వ తేదీన గిరి ప్రదక్షిణ, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 10న తిరుమంజనం, ధ్వజారోహణ (కొడిముద్దలు), శేషవాహన సేవ, 11న హనుమంత సేవ, 12న ఉదయం మోహినీ ఉత్సవం, రాత్రికి గరుడసేవ, 13వ తేదీన ఉదయం మొక్కుబడులు, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి గజవాహనసేవ, 14న ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి అశ్వవాహన సేవ, 15న సాయంత్రం పుష్పయాగం, రాత్రికి ఏకాంతసేవతో ఉత్సవాలు పూర్తవుతాయి. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

బెల్లం సరఫరా చేయొద్దు

- వ్యాపారులకు ఏసీ, డీపీఈఓల హెచ్చరిక



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(క్రైమ్): నాటుసారా తయారీదారులకు బెల్లం సరఫరా చేయొద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.దయాసాగర్‌రావు, డీపీఈఓ ఎ.శ్రీనివాసనాయుడు బెల్లం వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం నెల్లూరు బీవీ నగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో బెల్లం హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పది కేజీల మించి బెల్లం విక్రయిస్తే కొనుగోలుదారుని ఆధార్, ఫోన్ నంబర్‌ను సేకరించి ఆ వివరాలను ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. బెల్లం కొనుగోలుకు వచ్చేవారు అనుమానాస్పదంగా ఉంటే తమకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్ పి.రమేష్‌బాబు, ఎస్సై ఎస్.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: పీఎంశ్రీ పథకం ద్వారా జిల్లాలో ఎంపికైన పాఠశాలలకు మంజూరైన నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో 42 పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, లైబ్రరీలు, కిచెన్ షెడ్స్, మరుగుదొడ్ల నిర్మాణం తదితర వాటికి రూ.5.33 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. స్కూళ్ల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఉపాధి పథకం ద్వారా బడుల్లో ప్లాంటేషన్, సీసీ రోడ్లు మంజూరు చేస్తామని చెప్పారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఈఈ సుబ్బారాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట



విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేసిన ఎస్పీ కృష్ణకాంత్, చిత్రంలో పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): మహిళల భద్రతకు పోలీస్ శాఖ పెద్దపీట వేసినట్లుగా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంకు వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఐసీడీఎస్ పీడీ సుశీలాదేవీలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కేవీఆర్ పెట్రోల్ బంకు కూడలిలో విద్యార్థినులు నృత్యాలు చేస్తూ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. తొలుత ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో మహిళల గౌరవాన్ని పెంపొందించే విధంగా పోలీసు అధికారులు పలు చిత్రాలను ప్రదర్శించారు. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు ఎస్పీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ మునిరాజా, నగర డీఎస్పీ పి.సింధుప్రియ, డీసీపీఓ సురేష్, సీడీపీఓలు లక్ష్మీదేవి, అనురాధ, డీటీసీ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, ఆర్ఐలు అంకమరావు, రాజారావు, అధ్యాపకురాలు లేపాక్షి, పలు కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

కుమారుడు పెళ్లి చేసుకోవడం లేదని..

- తల్లి ఆత్మహత్య

కోవూరు: కుమారుడు పెళ్లికి నిరాకరించడంతో అతని తల్లి అయిన చుండుగుంట గ్రామానికి చెందిన ఎస్.సుజన (49) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సుజనకు శ్రీకాంత్ అనే కుమారుడు ఉన్నాడు. పెళ్లి చేసుకోమని అతడికి తల్లి చెబుతూ వచ్చింది. అయితే వాయిదా వేస్తూ వచ్చాడు. తట్టుకోలేకపోయిన సుజన కుమారుడి ఆలోచన మార్చాలని భావించి ఈనెల 5వ తేదీన పురుగు మందు తాగింది. ఆమెను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎం ఆఫీస్ నుంచి వచ్చామంటూ..

- దంపతులను మోసం చేసిన వ్యక్తి
- రూ.50 వేలతో ఉడాయించిన వైనం

నెల్లూరు(క్రైమ్): మీ పిల్లలు మలేసియాలో చిక్కుకుపోయారని తెలిసి సీఎం కార్యాలయం నుంచి వచ్చానని దంపతులను ఓ వ్యక్తి నమ్మించాడు. పిల్లలను స్వదేశానికి తీసుకొస్తానని రూ.50 వేలు తీసుకుని ఉడాయించిన ఘటనపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తెగచర్ల గ్రామానికి చెందిన జయమ్మ, పెద్దయ్య దంపతులు ప్రస్తుతం హరనాథపురంలో ఉంటున్నారు. వారి కుమారుడు సింహాద్రి ఇంటర్మీడియట్ వరకు చదివాడు. మలేసియాలోని హోటల్లో పనిచేస్తే ఎక్కువ డబ్బులొస్తాయని ఓ ఏజెంట్ సింహాద్రిని, అతని తల్లిదండ్రులను నమ్మించాడు. దీంతో వారు రూ.50 వేలు అతడికి ఇచ్చారు. సింహాద్రితోపాటు అతని పెదనాన్న కుమారుడు పవన్‌ను గతేడాది జూన్‌లో మలేసియాకు పంపారు. ఏజెంట్ వర్క్ పర్మిట్ అని వారిని నమ్మించి టూరిస్ట్ వీసా ఇవ్వడంతో ఇటీవల సింహాద్రి, పవన్‌ను మలేసియా పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని స్వదేశానికి రప్పించాలంటూ ఇటీవల పెద్దయ్య, జయమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి తాను సీఎం కార్యాలయం నుంచి వచ్చానని జయమ్మ, పెద్దయ్యను కలిశాడు. మీ గ్రామంలో మీ పిల్లల గురించి ఆరాతీయగా వారిపై ఎలాంటి కేసులు లేవని తేలిందన్నాడు. కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లాడు. కలెక్టర్‌తో మాట్లాడి వస్తానని వారిని బయట కూర్చోబెట్టి లోపలికి వెళ్లాడు. కొద్దిసేపటి అనంతరం బయటకు వచ్చినతను అంతా మాట్లాడానని సింహాద్రి, పవన్‌లను తీసుకొచ్చేందుకు విమాన టికెట్లు, ఇతర ఖర్చులు రూ.60 వేల వరకు అవుతాయని చెప్పాడు. తాము అంత ఇవ్వలేమని బాధిత తల్లిదండ్రులు చెప్పగా చివరగా రూ.50 వేలు తీసుకుని ఇప్పుడే వస్తానని వెళ్లిపోయాడు. అలా వెళ్లిన వాడు ఎంతకీ రాకపోవడంతో పెద్దయ్య అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయామని గ్రహించిన పెద్దయ్య, జయమ్మలు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, PATTAN MAHABOOB JANI (Old Name), Residing at 28-9-514, Viswarlaharathi School, Near Vijaya Milk Dairy, Venkateswarapuram, Nellore, SPSR Nellore Dt, AP. here by declare that I have changed my name as SHAIK MAHABOOBJANI S/o. SHAIK GHOUSE SAHEB.

CHANGE OF NAME
I, RAMISETTY MOHAN (OLD NAME), S/o.RAMISETTY RAMAIAH R/o. FLAT No 104, 1ST FLOOR, ROYAL RESIDENCY APARTMENT, VANAMTHOPU, NELLORE-524004 SPSR NELLORE DISTRICT, ANDHRA PRADESH. I Changed my name to RAMISETTY MOHAN RAO. Henceforth ,I will be Known as RAMISETTY MOHAN RAO.

CHANGE OF NAME
I, RAMISETTY VIPULA (Old Name), W/o.RAMISETTY MOHAN RAO, D/NO 25-9-475,6TH STREET, NEAR POST OFFICE ,POSTAL COLONY NELLORE -524004 SPSR NELLORE DISTRICT ,ANDHRA PRADESH . I Changed my name to RAMISETTY SRAVANI. Henceforth, I Will be Known as RAMISETTY SRAVANI.

EDUCATION
■A.N.U (CDE) : BA, B.Com, BBA, MA (All), M.Sc(All) M.Com, B.L.I.Sc, M.L.I.Sc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. C/o. SVR కాలేజ్, చాకలి వీధి, నెల్లూరు. 8121888335, 9177951600. [NA-11248]

DIRECT FINAL YEAR
■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-2536]
■ 10th, Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil,Ph.D., BNYS, BPT: 9030030125. [T-1352]

REAL ESTATE
FLAT FOR SALE
■RTC బస్టాండ్ దగ్గర, అరవిందనగర్, స్ప్రింగ్ నెస్ట్ అపార్ట్‌మెంట్‌లో 1650 చ॥అ॥ల, లాస్ట్ ఒక 3 BHK FLAT అమ్మకానికి కలదు.ఫోన్ : 96770 10777 [V-2757]

PLOT FOR SALE
■నిప్పో ఫ్యాక్టరీ మెయిన్ గేట్ ఎదురుగా చంద్రమౌళి నగర్ 2వ వీధిలో21 అంకణముల స్థలములో ఉన్న రేకుల ఇల్లుతో సహా అమ్మకానికి కలదు. ఫోన్ : 96770 10777 [V-2763]
■10 లక్షలకే కొత్తూరు పద్మావతిలో, 35 లక్షలకే ద్వారకామయిలో, ఐకియా స్కూల్ దగ్గర అంకణం 1 లక్ష 70వేలు, NTR నగర్ హైవే అంకణం 1 లక్ష 60 వేలు. ప్లాట్లు అమ్మబడును. 90147 85919. [NA-11250]
■నెల్లూరు ముత్తుకూరు రోడ్డు బ్రహ్మదేవం ఆనంద విహార్ నుడా వెంచర్‌లో అం॥ 53వేలు ప్లాట్ కొన్న వారికి 200గ్రా॥ వెండి, 200 సిమెంట్ బస్తాలు ఉచితం.ఇప్పటికి ఇప్పుడు ఇల్లు కట్టుకునేవారికి 200 సిమెంట్ బస్తాలు ఉచితం. సంప్ర : 77025 37169. [N-1270551]

TO-LET
■నెల్లూరు హరనాథపురం 2వ వీధి, నాగసాయి మందిరం వీధిలో గ్రౌండ్ ఫ్లోర్ 2 Bed Room House అద్దెకు ఇవ్వబడును. వివరాలకు సంప్ర : 80950 83977, 98490 54028. [NA-6849]

SERVICES
TAILORING
■మీకు టైలరింగ్ వచ్చా.. మీ ఇంటి వద్దే.. మిషన్ కలిగి వుంటే నెలకు 18-26 వేల వరకు సంపాదన. మా ఫ్యాక్టరీలో నైటీలు, నైట్ డ్రస్‌లు కుట్టవలెను. హోల్‌సేల్‌గా అమ్ముకోవచ్చు. 94406 40514. [NA-6848]

WANTED
■Agilavetri Groups Marketing Jobs 1. Sales Executives-15,000/-, 2. Sales Managers - 30,000/-. Target Based Incentive.Contact Number:9866031003. [N-1268010]
■Wanted Lady Tele Callers to work for a Real Estate Company. Location : Magunta Layout, Nellore. Qlf : Inter/ Degree. Salary : 10 to 15K + Incentives. Cell : 93938 48246. [NA-11251]
■రోహిత పారడైస్ B బ్లాక్ నందు 1585 sqft 3 BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు . :7386913216 [SCA-25002037]
■శుభలక్ష్మి పసుపు సంస్థకు కలెక్షన్ బాయ్స్-2, డ్రైవర్-2 కావలెను. వివరములకు సంప్రదించండి: V.ప్రభాకర్, పోతిరెడ్డి పాళెం. సెల్: 92478 88909. [N-1270501]
■డాక్యుమెంట్ రైటర్ ఆఫీసులో తెలుగు టైపింగ్ చేయుటకు లేడి (Female) డి.టి.పి. ఆపరేటర్స్ కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్ : 94922 18808, 77803 33090. [NA-5496]
■ఫోర్స్ కంపెనీ షోరూం నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్స్, హెల్పర్స్, 6టైర్ డ్రైవర్ కావలెను. బుజబుజనెల్లూరు, నెల్లూరు. సెల్ : 95812 99916, 94929 34103. [NA-11247]
■ప్రభుత్వ సంస్థలలో అవుట్ సోర్సింగ్ ద్వారా కంప్యూటర్Op., రికార్డ్ అసిస్టెంట్, అటెండర్స్, సూపర్‌వైజర్స్ కావలెను. & అన్ని రకాల కాంట్రాక్ట్ ఉద్యోగాలకు సంప్ర: 82979 22999. [T-2528]
■నెల్లూరు, చింతారెడ్డిపాలెం, పిడతా పోలూరు నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్-30, ఫీల్డ్ ఆఫీసర్ కావలెను. జీతం: 10,000/-, రూము భోజనం ✆ 9676392502, 9866076701 [T-1267306]
■నెల్లూరు శ్రీ తిరుమల ఆటోఫైనాన్స్ నందు వర్క్ చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 15000/- పెట్రోల్: 4000. సంప్ర: 91002 77763 [G-9715]
■షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు వార్డ్ బాయ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15160]
■కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 6309020999 [HA-37]
■ప్రముఖ విద్యాసంస్థకు అకాడమిక్ ప్రిన్సిపల్ 6th to 10th ఫిజిక్స్ టీచర్లు, గ్రాఫిక్ డిజైనర్,క్లర్క్స్, కారు డ్రైవరు కావలెను. నాన్ లోకల్‌కు ఉచిత వసతి, నలంద ఒలంపియాడ్ స్కూలు, మానస థియేటర్ దగ్గర,కావలి. 99498 49758,74161 62099. [NA-1268163]
■తిరుపతి,M.R.Palliపోలీస్ స్టేషన్ ప్రక్క. Village Touchహోటల్ నందు పనిచేయుటకు బిల్లింగ్, సర్వీస్,క్లీనింగ్ స్టాఫ్Male/Femaleకావలెను (ఉచిత వసతి,భోజనం) జీతం:12 to 14K, ఆసక్తి గల అభ్యర్థులు పాస్ Port Photo, Bio-Data Whats app లో పంపగలరు. 9160006077. [T-2535]
■లేడీ కంప్యూటర్ ఆపరేటర్ : Qlf: B.C.A / B.Tech/MCA/Any Degree With Computer Knowledge. లేడీ పార్మసిస్టు : Qlf: GNM / B.Sc nursing with 1 Year Experience. మా హాస్పిటల్ నందు పని చేయుటకు కావలెను. Contact : Dr.S.Andal Bhaskar, Lakshmi Fertility Centre, Near S2 Cinemas, Pogathota, Nellore. Ph : 9908854316. [NA-2803]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.